క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు



ఆధార్ సేవా కేంద్రంలో ఐరిస్ నమోదు చేస్తున్న బీఎస్ఎన్ఎల్ సిబ్బంది

సీతంపేట: బుల్లయ్య కళాశాల రోడ్, స్పెన్సర్స్ మాల్ వెనుక గల బీఎస్ఎన్ఎల్ కస్టమర్ కేర్ సెంటర్‌లో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎవరైనా ఆధార్ సేవలు పొందవచ్చు. బయోమెట్రిక్ అప్‌డేట్(వేలి ముద్రలు), డెమోగ్రాఫిక్ అప్‌డేట్–చిరునామా, పుట్టిన తేదీ, పేరు మార్పు, మొబైల్ నంబర్ లింక్ చేయడం వంటి సేవలు ప్రభుత్వం నిర్దేశించిన రూ.50 నుంచి రూ.100 నామమాత్రపు రుసుముతో పొందవచ్చు. ప్రతి రోజూ 20 నుంచి 30 మందికి ఆధార్ సేవలు పొందే వీలు కల్పించారు. వివరాలకు 85003 68994, 765999 0829 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

మధుర ఫలం.. రుచులు ఘనం

ఏడాదిలో ఒకసారి అపురూపమైన అతిథిలా వచ్చి పలకరించే మామిడి పళ్లు మార్కెట్‌లో రాశులుగా దొరుకుతున్నాయి. వీటి దెబ్బకి ఇదే సీజన్‌లో మార్కెట్లను ముంచెత్తాల్సిన పుచ్చకాయలు కనిపించటంలేదు. నిన్నమొన్నటి వరకు పుచ్చకాయలు విక్రయించిన వ్యాపారులంతా మామిడి పళ్ల వ్యాపారంలోకి దిగిపోయారు. అలా ఉంటుంది మామిడి పళ్లపై మోజు. ఈ ఏడాది మార్కెట్‌లో దొరుకుతున్న మామిడి పళ్లు రుచిగా, నాణ్యంగా ఉండటంతో వినియోగదారులు భారీగా వీటిని కొనుగోలు చేస్తున్నారు.

- మార్కెట్‌లో వెల్లువెత్తిన బంగినపల్లి.. రసాలు.. సువర్ణరేఖలు
- కిలో రూ.100 నుంచి రూ.150
- పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



నీలమ్మ వేపచెట్టు రోడ్డులో మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారు

అల్లిపురం: వేసవి వచ్చిందంటే పళ్లలో రారాజుగా పిలిచే మామిడి పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. మామిడి పళ్లలో ఎన్నో రకాలున్నా అందరూ ఇష్టపడేది బంగినపల్లి అంటే అతిశయోక్తికాదు. ఈ ఏడాది మామిడి పంట దిగుబడి తక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ నగరానికి కొత్తవలస, సబ్బవరం, విజయనగరం, తగరపువలస ప్రాంతాలతో పాటు తూర్పుగోదావరి జిల్లా నుంచి కూడా మామిడి పండ్లు వస్తున్నాయి. ముఖ్యంగా రామకృష్ణా జంక్షన్, మెయిన్‌రోడ్డు, నీలమ్మ వేపచెట్టు ప్రాంతాలతో పాటు పూర్ణామార్కెట్‌లో మామిడి పండ్లు విరివిగా దొరుకుతున్నాయి.



రామకృష్ణా జంక్షన్‌లో మామిడి పండ్ల విక్రయాలు

అందుబాటు ధరలోనే..

మామిడి పండ్లు అందుబాటు ధరలోనే లభిస్తున్నాయి. రైతు బజార్లలో రకాలను బట్టి బంగినపల్లి, సువర్ణరేఖ కేజీ రూ.75 నుంచి రూ.80, ఓపెన్ మార్కెట్‌లో కేజీ రూ.100 నుంచి రూ.150కి లభిస్తున్నాయి. రసాలు రైతు బజారులో కేజీ రూ.80కి లభ్యమవుతున్నాయి. బయటి మార్కెట్‌లో కేజీ రూ.100కి లభిస్తున్నాయి. క్వాలిటీ విషయానికి వస్తే ఈ ఏడాది మామిడి పండ్లు ఒకింత నాణ్యంగానే ఉన్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ఈ ఏడాది కార్బన్‌తో మగ్గబెట్టినవి అంతగా మార్కెట్లో కానరాలేదు. ఎక్కువగా గడ్డి కాపు పండ్లు దొరుకుతున్నాయి. మధురమైన రుచితో అందరి నోళ్లు ఊరిస్తున్నాయని చెప్పొచ్చు. ఏదైనా ఏడాదికి ఒకసారి దొరికే ఫలం ఎంత ధరైనా తిని తీరాల్సిందే అని వినియోగదారులు కొనుక్కొని వెళ్తున్నారు.

ధర గిట్టుబాటు కావటం లేదు..



కొత్తవలస నుంచి వ్యయప్రయాసలకోర్చి నగరానికి మామిడి పండ్లు తీసుకొస్తున్నాం. కానీ ధర గిట్టుబాటు కావటం లేదు. కొనే వారు ఎంత తక్కువ చెప్పినా బేరాలు ఆడుతున్నారు. మా కూలీ గిట్టుబాటయ్యేలా అమ్ముకుంటున్నాం. ప్రయాణ చార్జీలు.. ఇక్కడ ఖర్చులు పోను ఏ కొంచెం లాభమొచ్చినా సరుకు అమ్మేసుకుంటున్నాం.

– చిట్టమ్మ, మామిడి పండ్ల వ్యాపారి, కొత్తవలస

ధర ఎంతైనా కొనాల్సిందే..



ఏడాదిలో రెండు నెలలు మాత్రమే మామిడి పండ్లు దొరుకుతాయి. ఎంత ధరైనా కొని తినాల్సిందే. బంగినపల్లి మామిడి పండ్లు ఈ ఏడాది రుచిగా, తియ్యగా ఉన్నాయి. కాయ ముదరటంతో మంచి రుచి వచ్చింది. మే మధ్యలో పండ్లకి మంచి రుచి వస్తుంది. ఇదే కరెక్ట్ సమయం మామిడి పండు తినడానికి. ధర కూడా మరీ ఎక్కువగా లేదనే చెప్పాలి.

– ఎం.సుబ్బలక్ష్మి, వినియోగదారు

ఆ దారిలో ప్రయాణం నరకం

కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్‌కు వెళ్లే దారిలో నిత్యం ట్రాఫిక్ జామ్



జిల్లా పరిషత్ రోడ్డులో వాహనాల రద్దీ

మహారాణిపేట: కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ రోడ్డుకు వెళ్లే దారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. ఈ రోడ్డు మీద పలు వాహనాలు నిలిపేసి ఉంచటం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడే అనేక క్లినిక్‌లు, పరీక్షా కేంద్రాలు, స్కానింగ్, ఎక్స్‌రే సెంటర్లు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. ఇక్కడికి వైద్య సేవల కోసం నిత్యం పలు వాహనాల్లో రోగులు, వారి బంధువులు వస్తుంటారు. ఈ వాహనాలను రోడ్ల మీదే ఇష్టమొచ్చినట్లు పార్కింగ్ చేయటం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు కూడా లేకపోవడంతో ఈ దారిలో ప్రయాణం దుర్లభమవుతోందని ప్రజలంటున్నారు.

క్రీడలతోనే మానసిక వికాసం

డాబాగార్డెన్స్ : విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు అవసరమని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అధికారి జాన్ గాలియట్ తెలిపారు. అర్జున్ షూటింగ్ అకాడమీలో నిర్వహించిన పోటీలో విజేతలుగా నిలిచిన సుహాస్, సాయి కౌశిక్, రతన్ ఎమ్మి, వేదంగ్, నాగసాయి దేవర్ష్, హర్షిత్, కార్తికేయ, సాయి తన్మయి, స్వాతి, దీప్తి, జాయ్సి, నేహా, హర్షిత్, సాయిరవి, జశ్వంత్, హర్షిత అనుసూరి, బాబూరావు, రోహిత్, రవీంద్రరెడ్డి, జైన్, చరంజిత్, రేణు, హనీష్, హాసిని, లలిత, సాయి శ్రీరామ్, సచిత్, షణ్ముఖ, వేద్ వీక్షిత్, శశిహనుమాన్, సుబ్బారావు తదితరులకు మెడల్స్ అందజేశారు.

పిల్లలకు నీతికథల బోధన



చిన్నారులకు నీతి కథలు చెబుతున్న జయంతి

డాబాగార్డెన్స్: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో శనివారం బాలలకు స్నేహంలోని గొప్పదనంపై నీతి కథలు చెప్పారు. రీసోర్స్ పర్సన్ కె. జయంతి పాల్గొని విద్యార్థులకు స్నేహబంధంపై అవగాహన కల్పించారు. బుక్ రీడింగ్ వల్ల ఉపయోగాలు, జనరల్ నాలెడ్జిపై కె. కార్తీక్ వివరించారు. గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి నేతృత్వంలో నిర్వహించిన శిబిరంలో పలువురు బాలలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన వాసుపల్లి

డాబాగార్డెన్స్: వచ్చే నెల 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను వైఎస్సార్‌సీపీ దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన వాసుపల్లి అక్కడి పరిస్థితులపై తెలుసుకున్నారు. భద్రతాపరమైన చర్యలు గమనించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్ ప్రతిరోజూ అసెంబ్లీ, పార్లమెంట్ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లు తనిఖీ చేసి అక్కడి పరిస్థితులు ఎప్పటికప్పుడు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు తెలియజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

1, 2 తేదీల్లో టాలెంట్ హంట్



చిన్నారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న షకీల్

డాబాగార్డెన్స్: మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 1, 2 తేదీల్లో టాలెంట్ హంట్ పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు శనివారం క్లబ్ కార్యాలయంలో చిన్నారులచే పోస్టర్ ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం, భరతనాట్యం, జానపద నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని చెప్పారు. పౌరగ్రంథాలయం వేదికగా జూన్ ఒకటి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని, పాల్గొనదలిచే వారు 9966485335, 9553333134 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

ఎర్నిమాంబ అమ్మవారి సన్నిధిలో అన్న సంతర్పణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అన్నప్రసాదాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్. సుజాత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సుమారు 5 వేల మందికి అన్నసమారాధన చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఎర్నిమాంబ అమ్మవారి మారువారం జాతర నిర్వహిస్తున్నట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు.

మహిళల కోసం ఫెమిరైడ్ యాప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : విశాఖలోని మహిళలకు పూర్తి రక్షణ, భద్రత కల్పిస్తూ నూతనంగా ఓలా, ఉబర్ తరహాలో ఫెమిరైడ్ యాప్ అందుబాటులోకి తెచ్చినట్టు రాధిక బెహరా తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ర్యాపిడో, ఓలా, ఉబర్ సంస్థలు పురుషులు, మహిళలకు కూడా యాప్‌లో వివరాలు అందిస్తే నచ్చిన వాహనాలు పంపుతున్నాయని, ఫెమిరైడ్ యాప్ మాత్రం కేవలం మహిళలకు ప్రత్యేకంగా వాహనాలు నడుపుతున్నాయని తెలిపారు. డ్రైవర్లు కూడా మహిళలే ఉంటారన్నారు. విశాఖ నగర పరిధిలోనే ఈ ఫెమిరైడ్ యాప్ అమలు చేస్తున్నట్టు తెలిపారు.

తులసి మరణం అంగన్‌వాడీలకు తీరని లోటు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

డాబాగార్డెన్స్: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షురాలు వై. తులసి అకాల మరణం అంగన్‌వాడీలకు తీరని లోటని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తులసి సంస్మరణ సభ శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిటు ఆధ్వర్యంలో పి. మణి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా తులసి చిత్రపటం వద్ద సుబ్బరావమ్మతో పాటు సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, బేబీరాణి, దేవి, బృందా, పద్మ, శోభ, వెంకటలక్ష్మి, తులసి భర్త శ్రీనివాస్, కుమారుడు దిలీప్, కుమార్తె స్వాతి, సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పలువురు, యూనియన్ నాయకులు నివాళులర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి. పద్మ, సిటు అనుబంధ యూనియన్ల నాయకులు పి. వెంకట్‌రెడ్డి, యు. రాజు, టి. నూకరాజు, బి. జగన్, పద్మ, మేరీ, కె. సంతోష్, కేఎం కుమార్ మంగళం, బొట్టా ఈశ్వరమ్మ, కామేశ్వరి, పూర్ణిమ, ఎం. చంటి పాల్గొన్నారు.